క్లుప్తంగా

ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు



కౌతాళం: మండలంలోని అంజనేయస్వామి ఆలయాలకు శనివారం భక్తులు అధికంగా తరలి వచ్చి పూజలు నిర్వహించారు. దీంతో స్వామి ఆలయాలు భక్తులతో సందడిగా మారాయి. మండల కేంద్రమైన కౌతాళంతో పాటు మండల పరిధిలోని అగసల దిన్నె గ్రామంలో వెలసిన ఆంజినేయస్వామి, సుళేకేరి గ్రామ శివారులో వెలసిన బుడు ములదొడ్డి ఆంజనేయస్వామి దేవాలయం, ఎరిగేరిలో వెలసిన పులిగట్టు ఆంజినేయస్వామి దేవాలయాల్లో స్వామికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. తెల్లవారుజామున అర్చకులు స్వామికి సుప్రభాతసేవ, మహామంగళహారతి, ఆకుపూజ, పంచామృతాభిషేకం వంటి ప్రత్యేక పూజలను చేపట్టారు.

చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఎస్పీ ఉపేంద్రబాబు

పెద్దకడబూరు : విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండి జీవితాన్ని తీర్చిదిద్దుకోవాలని డీఎస్పీ ఉపేంద్రబాబు సూచించారు. శనివారం మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో ఎస్‌ఐ నిరంజన్‌రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులకు సైబర్ నేరాలు, డ్రగ్స్, చెడు అలవాట్లు తదితర విషయాలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఈవ్ టీజింగ్ వంటి వాటి జోలికి పోరాదన్నారు. దీనివల్ల ఒక్కోసారి ప్రాణాలమీదకే వస్తుందన్నారు. విద్యార్థి దశ నుంచే ఆత్మవిశ్వాసంతో ముందుకు వెళ్లితే తమ లక్ష్యాన్ని చేరుకోవచ్చునన్నారు. తాగుడు, ధూమపానం, గ్యాంబ్లింగ్ వంటివాటికి ఆకర్షి తులు కారాదని, వాటివల్ల జీవితానికే నష్టం వాటిల్లుతుందని హెచ్చరించారు.

కనీస వేతనం ఇస్తాం.. వలస వెళ్లకండి



పని ప్రదేశంలో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఏపీఓ చంద్రశేఖర్

పెద్దకడబూరు : నిర్ణయించిన మేరకు పనులు చేస్తే కనీస వేతనం ఇస్తామని మండల ప్రజలు ఎవరూ కూడా వలసలు వెళ్లరాదని ఏపీఓ చంద్ర శేఖర్ అన్నారు. మండల కేంద్రంలో ఉపాధి కూలీలు చేస్తున్న పని ప్రదేశాన్ని శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్కడో సుదూర ప్రాంతాలకు పోయి తమ కుటుంబాలలోని ముసలి, పిల్లలను ఇబ్బందుల పాలు చేస్తున్నారన్నారు. మండలంలో ఏ గ్రామంలో పనులు అడిగినా, ఎక్కడ ఏ పని అడిగినా వాటిని కల్పించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఈ అవకాశాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

మృత శిశువుకు అంత్యక్రియలు



హిందూ శ్మశాన వాటికలో అంత్యక్రియలు చేస్తున్న దృశ్యం

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని సోగనూరు రోడ్డులో మురుగుకాలువలో గురువారం పార వేసిన మృత శిశువు(ఆడ)కు శనివారం ప్రజా సంఘాల వారు స్థానిక హిందూ శ్మశాన వాటికలో అంత్యక్రియలు చేశారు. స్థానిక ఆస్పత్రిలోని మార్చూరి నుంచి మృతశిశువును హిందూ శ్మశాన వాటికకు తరలించి అక్కడ ఖననం చేశారు. కార్యక్రమంలో మల్లెల గ్రూప్ అధినేత మల్లెల ఆల్‌ఫ్రెడ్‌రాజు, పూలే అంబేడ్కర్ ఎడ్యుకేషనల్ సొసైటీ సభ్యులు రాము, సింగనేటి ప్రతిభా భారతి, నరసన్న, అబ్రహం, కదిరికోట షాలెం, యువరాజు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం వడ్డించాలి



కళాశాలలో వంటలను పరిశీలిస్తున్న ఎంఈఓ-2 శోభారాణి

కోసిగి: కళాశాలలో విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం వడ్డించాలని ఎంఈఓ-2 శోభారాణి సూచించారు. శనివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ లక్ష్మీదేవి సమక్షంలో మధ్యాహ్న భోజన పథక వంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా రోజు వారిగా కళాశాలకు హాజరయ్యే విద్యార్థుల హాజరు శాతం ఆధారంగా భోజనం చేయాల్సి ఉంటుందన్నారు. మెనూ ప్రకారం ఆకు కూరగాయాలతో కూడిన ఆహారం వడ్డించాలని వంట ఏజెన్సీలకు సూచించారు. అధ్యాపకుడు సాంబశివుడు ఉన్నారు.

పొరపాట్లకు తావులేకుండా రీ సర్వే చేయాలి

- రైతులకు ముందుగా నోటీసులు ఇవ్వాలి
- జిల్లా కలెక్టర్ పి. రంజిత్ బాషా



గోనెగండ్లలోరైతులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ పి. రంజిత్ బాషా

గోనెగండ్ల : పొరపాట్లకు తావు లేకుండా రీ సర్వే చేయాలని జిల్లా కలెక్టర్ పి. రంజిత్ బాషా సర్వేయర్లను ఆదేశించారు. శనివారం మండల కేంద్రం గోనెగండ్ల సమీపంలో పంట పొల్లాలో జరుగుతున్న రీ సర్వే ప్రక్రియను ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌తో కలిసి కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాలలో రీ సర్వే నిర్వహించేటప్పుడు ముందుగా రైతులకు నోటీసులు ఇచ్చి తగిన సమయం ఇవ్వాలన్నారు. రైతుల సమక్షంలోనే భూములను సర్వే చేయాలని సర్వేయర్లను ఆదేశించారు. సర్వే ప్రారంభం లోనూ, సర్వే చేసినప్పుడు, ముగింపులో ఫొటోలు తీయాలని సూచించారు. సర్వే సమయంలో వీఆర్వో కూడా ఉండాలని, గ్రామ లెక్కల్లో ఏమైనా పొరపాట్లు ఉంటే సరి చేయాలన్నారు. అనంతరం రైతులతో మాట్లాడారు. సర్వే చేయడానికి ముందే మీకు నోటీసులిచ్చారా? మీకు పాస్ పుస్తకాలు ఉన్నాయా? రీ సర్వేలో మీకు ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. నోటీసులు ఇచ్చారని, తమ సమక్షంలోనే సర్వే చేస్తున్నారని రైతులు కలెక్టర్‌కు తెలిపారు. అనంతరం రీ సర్వేకు సంబంధించిన రికార్డులు, సర్వే మ్యాప్‌లను సర్వే నిర్వహిస్తున్న భూములను పరిశీలించారు. కార్యక్రమంలో ఆదోని సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్, అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, సర్వే ఏడీ ముని కన్నన్, తహసీల్దార్ కుమారస్వామి, సర్వేయర్లు, రైతులు పాల్గొన్నారు.

ప్రొటోకాల్ పాటించని అధికారులపై చర్యలు తీసుకోవాలి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు మురళీ నాయుడు

గోనెగండ్ల : ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రజా ప్రతినిధులను పక్కన పెట్టి, అధికార పార్టీకి చెందిన వ్యక్తులను ఆహ్వానించి ప్రొటోకాల్ పాటించని అధికారులపై చర్యలు తీసుకోవాలని నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ అధ్యక్షుడు టి. మురళీ నాయుడు కోరారు. శనివారం మండల కేంద్రం గోనెగండ్లకు వచ్చిన జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషాకు వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని ప్రభుత్వ అధికారులు ప్రభుత్వ కార్యక్రమాలకు ప్రజా ప్రతినిధులను కాదని, రాజకీయపరమైన ఆహ్వానాలు పలకడం సరైంద కాదన్నారు. ఇటీవల గోనెగండ్లలో వ్యవసాయ అధికారులు ప్రభుత్వ కార్యక్రమానికి ప్రజా ప్రతినిధులను ఆహ్వానించకుండా టీడీపీ నాయకులను ఆహ్వానించారని గుర్తు చేశారు. ప్రజలచే ఎన్నికైన ప్రతి నిధులను పూర్తిగా విస్మరిస్తూ అధికార పార్టీకి చెందిన నాయకులు, కార్యకర్తలకే ప్రాధాన్యత ఇస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఘనంగా విశ్వలింగేశ్వర స్వామి ప్రభోత్సవం



భక్తుల మధ్య ఊరేగుతున్న స్వామి వారి ప్రభోత్సవం

కోసిగి: మండల పరిధిలోని అగసనూరు గ్రామంలో వెలసిన శ్రీ విశ్వలింగేశ్వర స్వామి ప్రభోత్సవం శనివారం సాయంత్రం వందలాది మంది భక్తుల మధ్య ఘనంగా నిర్వహించారు. వేకువజామున నుంచి ఆలయ అర్చకులు పూజారి ఈరన్న స్వామి ఆధ్వర్యంలో స్వామి వారికి జలాభిషేకం, రుద్రాభిషేకం, వెండికవచ అలంకరణ, ఆకు పూజ, హోమాలు, మహా మంగళ హారతులు గావించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ ప్రజలు స్వామి వారికి నైవేద్యం, నారకేలాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేసుకున్నారు. ఆలయ ప్రాంగణంలో శివపార్వతుల కల్యాంణం మేళతాళాలు, డప్పువాయిద్యాల మధ్య కమనీయంగా సాగింది. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో ప్రభపై ఉత్సవ మూర్తులు శివపార్వతులను కొలువుంచి మహిళలు కలశాలు, మేళతాళాలు డప్పువాయిద్యాలతో స్వామి వారికి పాదాల వరకు ఊరేగించి, తిరిగి యథావిధిగా ఆలయం వద్దకు చేర్చారు.

కౌతాళంలో ఫాగింగ్

కౌతాళం: మండల కేంద్రమైన కౌతాళంలో దోమల నివారణకు శనివారం సాయంత్రం ఫాగింగ్ ప్రక్రియను ప్రారంభించారు. ఈ ప్రక్రియను రోజు కొనసాగిస్తామని సర్పంచ్ పాల్‌దినకర్, కార్యదర్శి శివప్ప తెలిపారు. అనారోగ్యంతో ఉన్నవారు ఆస్తమా, ఆయాసం, ఉబ్బసం, అలర్జీలతో భాదపడేవారు అలాగే 60సంవత్సరాలు పైబడిన వారు సాయంత్రం 6 గంటల తరువాత ఇంట్లో నుంచి బయటకు రాకుండ ఉండాలని సూచించారు.

మహాశివరాత్రి ఏర్పాట్ల పరిశీలన



ఏర్పాట్లపై సిబ్బందితో మాట్లాడుతున్న ఈఓ రాంప్రసాద్, ఎస్‌ఐ శ్రీనివాసులు

నందవరం : మండల పరిధిలోని గురజాల రామలింగేశ్వర స్వామి ఆలయంలో శివరాత్రి జాతర ఏర్పాట్లను ఈఓ రాంప్రసాద్ పరిశీలించారు. ఎస్‌ఐ శ్రీనివాసులు నేతృత్వంలో ఆలయంలో భక్తుల క్యూలైన్లు, చలువ పందిళ్లు, షామియానాల ఏర్పాటును పర్యవేక్షించారు. ఈఓ మాట్లాడుతూ.. శివరాత్రి ఉత్సవాలలో పాల్గొనే భక్తులకు మౌలిక వసతులు కల్పిస్తున్నామన్నారు. వాహనదారులకు ఇబ్బందులు లేకుండా ప్రత్యేకంగా పార్కింగ్, మహిళలకు నది ఒడ్డున విద్యుత్ దీపాలు, బ్యారికేడ్లు, డ్రెస్సింగ్ రూములు, క్యూలైన్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా తాగునీరు, వాటర్ ప్యాకెట్లతో పాటు చలువ పందిళ్ల ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు శివారెడ్డి, హనుమంతు, అయ్యపురెడ్డి, పూజారి హంపేష్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

టెంకాయల విక్రయ హక్కుల వేలం

మహాశివరాత్రి మహోత్సవం సందర్భంగా ఆలయంలో టెంకాయల విక్రయానికి శనివారం దేవదాయ శాఖ అధికారులు, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో వేలం పాట నిర్వహించారు. గురజాల గ్రామానికి చెందిన కురవ మల్లికార్జున వేలంలో రూ.1.38,000 హెచ్చుపాడి దక్కించుకున్నట్లు తెలిపారు. గత సంవత్సరంలో రూ.1,26,500 కంటే ఈ సారి రూ.11,500 ఆదాయం లభించిందన్నారు.

17న మిర్చి రైతుల ధర్నా



మిర్చి రైతులతో మాట్లాడుతున్న రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యుడు బాషా

ఆదోని రూరల్: మిర్చికి గిట్టుబాటు ధర కల్పించాలని, నష్టపోయిన రైతులకు నష్టపరిహారం ఇవ్వాలని ఈనెల 17న తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపడుతున్నట్లు రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు బాషా తెలిపారు. శనివారం ఆయన రైతు సంఘం నాయకులతో కలిసి మండలంలోని హాన్వాల్ గ్రామంలో మిర్చి రైతులను కలిసి, మిర్చి దిగుబడులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మండలంలో ఖరీఫ్ సీజన్‌లో వేసిన మిరపకు గిట్టుబాటు ధర లేక రైతులు తీవ్రంగా నష్టపోయారని, తెగులు సోకి పంట దెబ్బతిందన్నారు. రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం తగదన్నారు. ధర్నాలో రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రైతులు పాండురంగ, గాదిలింగ, నాయకులు పాల్గొన్నారు.

మెడికల్ కళాశాల పనులు చేపట్టాలి



మాట్లాడుతున్న ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షుడు ప్రసన్న కుమార్

ఆదోని సెంట్రల్: ఆదోనిలో అర్ధంతరంగా ఆగిపోయిన మెడికల్ కళాశాల పనులను పునఃప్రారంభించాలని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షుడు ప్రసన్న కుమార్ డిమాండ్ చేశారు. రాష్ట్రంలో నెలకొన్న విద్యారంగ సమస్యలను తక్షణమే పరిష్కరించాలన్నారు. శనివారం పట్టణంలో ఎస్‌ఎఫ్‌ఐ 48వ జిల్లా మహాసభలు నిర్వహించారు. వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం మెడికల్ కళాశాలలను తీసుకొని వస్తే, ప్రస్తుత కూటమి ప్రభుత్వం వాటిని నడపలేమంటూ కేంద్రానికి ఎన్‌ఎంసీ లేఖ రాయడం దుర్మార్గమైన చర్య అన్నారు. పెండింగ్‌లో ఉన్న వసతి దీవేన, విద్యాదీవెన నిధులను విడుదల చేయకుండా కాలయాపన చేస్తున్నారన్నారు. సంక్షేమ వసతి గృహాల్లో మౌలిక సదుపాయాలను కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రంగప్ప, అబ్దుల్లా, శ్రీనివాసులు నాయకులు రవి.సాయి, ఉదయ్, విజయ్, నేషనల్ పాఠశాల కరస్పాండెంట్ గోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభ్యాసన సామర్థ్యాలు మెరుగు పరచాలి

ఆదోని సెంట్రల్: విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలను మెరుగు పరచాలని ప్రాథమిక పాఠశాలల క్లస్టర్స్ రిసోర్స్ పర్సన్స్ శ్రీనివాసులు, అహ్మద్ పటేల్, ప్రతాప్ రెడ్డి సూచించారు. పట్టణంలోని నెహ్రూమెమోరియల్ ఉన్నత పాఠశాల, పురపాలక ఉన్నత పాఠశాల, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో క్లస్టర్ సమావేశాలు శనివారం జరిగాయి. పాఠశాల ఎన్‌రోల్ మెంటు ఎలా పెంచాలి, వెనుక బడిన విద్యార్థులను ఏవిధంగా మెరుగు పరచాలి అనే అంశాలను వివరించారు.

పీఎఫ్, ఈఎస్‌ఐ సౌకర్యం కల్పించాలి

ఆదోనిరూరల్: స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో వివిధ డిపార్ట్‌మెంట్‌లలో పనిచేస్తున్న సిబ్బంది, సెక్యూరిటీ గార్డ్స్, పారిశుద్ధ్య కార్మికులకు పీఎఫ్, ఈఎస్‌ఐ సౌకర్యం కల్పించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు అజయ్‌బాబు, అధ్యక్ష కార్యదర్శులు వై.టి.భీమేష్, బి.వెంకన్న డిమాండ్ చేశారు. శనివారం కార్మికుల సమక్షంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ మాధవీలతకు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ గతంలో వందలోపు పడకలు ఉన్న సందర్భంలో ఎంత మంది కార్మికులు పనిచేస్తుండేవారో, ప్రస్తుతం 400కు పైగా పడకలు ఏర్పడినా వారితోనే చేయిస్తున్నారన్నారు. అదనంగా నియమించకోపవడతో కార్మికులకు తీవ్రమైన పనిభారం పెరిగిందన్నారు.

బట్టీల కాలుష్యాన్ని నివారించాలి

ఎమ్మిగనూరుటౌన్: ఎమ్మిగనూరు పరిధిలోని ఇటుక బట్టీల ద్వారా వచ్చే కాలుష్యాన్ని నివారించాలని ఏఐటీయూసీ అధ్యక్ష,కార్యదర్శులు వీరేష్, నరసింహారెడ్డి, విజయేంద్రలు డిమాండ్ చేశారు. శనివారం సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ప్రధాన హైవేల పక్కన వున్న ఇటుక బట్టీల నుంచి వచ్చే పొగ వల్ల ప్రజలు, వాహనదారులు అనారోగ్యాల బారిన పడుతున్నారన్నారు.

రేణుకా ఎల్లమ్మ దేవి ఉత్సవాలు ప్రారంభం



భక్తుల మధ్య అమ్మవారి ప్రభోత్సవం

కోసిగి: మండల ప్రజల ఆరాధ్య దైవం శ్రీ రేణుక ఎల్లమ్మ దేవి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. శనివారం రాత్రి దొరల చావిడీ సమీపంలో అమ్మ వారి ఇంటి వద్ద విశేష పూజలు చేపట్టి అమ్మవారి మూలవిరాట్‌ను పల్లకీలో కొలువుంచి మేళతాళాలు డప్పువాయిద్యాలతో ఆలయం వరకు ఊరేగింపు నిర్వహించారు. అమ్మవారి ప్రతిమను ఆలయంలో కొలువుంచి ఆలయ అర్చకులు గౌరీష్ గౌడ, మూర్తి గౌడల ఆధ్వర్యంలో ఫల, పుష్పాలు, వెండి, బంగారు కవచ అలంకరణలు గావించి, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అమ్మ వారి మూల విరాట్‌ను ప్రభపై కొలువుంచి ఆలయం నుంచి పాదాల చెంత వరకు లాగి తిరిగి యథాస్థానానికి చేర్చారు. ఊరేగింపులో దొర వంశస్తులు బసవరాజు దొర, చేతన్ దొరలు, ఆలయ కమిటీ పెద్దలు పాల్గొన్నారు.

హెల్మెట్ లేని ప్రయాణం ప్రాణాంతకం

- డీఎస్పీ మర్రిపాటి హేమలత
- ముగిసిన జాతీయ రహదారి భద్రతా మసోత్సవాలు
- పట్టణంలో బైకు ర్యాలీ



ప్రధాన రహదారిలో హెల్మెట్ పెట్టుకుని బైకు ర్యాలీ నిర్వహిస్తున్న డీఎస్పీ, ఎంవీఐ, సీఐలు, సిబ్బంది

ఆదోని అర్బన్: హెల్మెట్ లేని ప్రయాణం ప్రాణాంతకమని, ద్విచక్రవాహనదారులు నిర్లక్ష్యం వీడి తప్పనిసరిగా హెల్మెట్ వాడి సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని డీఎస్పీ మర్రిపాటి హేమలత సూచించారు. జాతీయ రహదారి భద్రతా మసోత్సవాలు ముగిసిన సందర్భంగా శనివారం పట్టణ ప్రధాన రహదారుల్లో డీఎస్పీ హేమలత, ఎంవీఐ సిసిరాదీప్తి, సీఐ గంటా సుబ్బారావు, శ్రీరామ్, నల్లప్పతో పాటు ఎస్‌ఐలు, పోలీసు సిబ్బంది హెల్మెట్ పెట్టుకుని బైకు ర్యాలీ నిర్వహించారు. డీఎస్పీ ఆధ్వర్యంలో జరిగిన ర్యాలీ స్థానిక టూటౌన్ పోలీస్‌స్టేషన్ నుంచి ప్రభుత్వ ఆసుపత్రి, కోట్ల కూడలి, ఎమ్మిగనూరు సర్కిల్ నుంచి తిరిగి టూటౌన్ పోలీస్‌స్టేషన్ వరకు సాగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో డీఎస్పీ మాట్లాడారు. గత నెల జనవరి 16వ తేదీ నుంచి ఫిబ్రవరి 15వ తేదీ వరకు జాతీయ రహదారి భద్రతా మసోత్సవాల్లో ప్రజలకు, విద్యార్థినీ, విద్యార్థులకు, వాహనదారులకు భద్రతా నియమ, నిబంధనల గురించి అవగాహన కల్పించామన్నారు. హెల్మెట్ లేని వాహనదారులకు కౌన్సెలింగ్ ఇచ్చి దానిపై అవగాహన కల్పించామన్నారు.

హెల్మెట్‌తో ప్రాణాలకు రక్ష

వాహనాలపై దూర ప్రాంతాలకు వెళ్లేవారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, హెల్మెట్ లేకపోవడంతో తలకు, మెదడుకు బలమైన గాయాలై ప్రాణాలు కోల్పోయిన పరిస్థితులు చాలావరకు చూస్తున్నామన్నారు. దీంతో మృతుల కుటుంబ సభ్యులు తీరని శోకం అనుభవించాల్సి ఉంటుందన్నారు. వేగంగా వెళ్లకూడదని, సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ వాహనాలను నడపకూడదన్నారు. కుటుంబ సభ్యులను దృష్టిలో పెట్టుకుని ట్రాఫిక్ నియమ, నిబంధనలు పాటించి తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు రామ్‌నాథ్, తిరుపాల్, నాగేంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

కోసిగిలో ఫుట్‌బాల్ టోర్నమెంట్

కోసిగి: మండల కేంద్రం కోసిగి మౌంట్ కార్మెల్ పాఠశాలలో ఈనెల 17వ తేదీన శ్రీ రేణుక ఎల్లమ్మ జాతరను పురస్కరించుకుని ఎంసీఎస్ ఎఫ్‌సీ క్రీడాకారుల ఆధ్వర్యంలో ఫుట్‌బాల్ టోర్నమెంట్ ప్రారంభించారు. శనివారం మధ్యాహ్నం పాఠశాల గ్రౌండ్‌ఫాదర్ థోమస్ చేతుల మీదుగా టోర్నమెంట్ ప్రారంభించారు. గెలుపొందిన వారికి కోసిగి ప్రజలు, దాతల సహకారంతో నగదు బహుమతులు అందజేస్తామని ఆర్గనైజర్స్ ఆకాష్, సందీప్, ఆకీరా తెలిపారు.

తాగునీటి సమస్యను పరిష్కరించండి

పెద్దకడబూరు : తాగునీటి సమస్యను పరిష్కరించాలని రాలయసీమ అభ్యుదయ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఖాజా, కృష్ణ డిమాండ్ చేశారు. రాయలసీమ విద్యార్థి ఫెడరేషన్ ఆధ్వర్యంలో శనివారం ఎంపీడీఓ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ కంబదహాల్ గ్రామంలో బోర్లు ఎండిపోయి నీరు రాకపోవడంతో వేసవి కాలం ఆరంభంలోనే తీవ్ర నీటి ఎద్దడి నెలకొందని వాపోయారు.

వక్ఫ్ బిల్లుకు మద్దతిస్తే ముస్లిం ద్రోహులే



సోమప్ప సర్కిల్‌లో నిరసన తెలియజేస్తున్న ముస్లింలు

ఎమ్మిగనూరుటౌన్: టీడీపీ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం వక్ఫ్ బిల్లుకు మద్దతు పలికితే ముస్లిం ద్రోహిగా ప్రకటిస్తామని స్థానిక ముస్లిం పెద్దలు తేల్చిచెప్పారు. కేంద్రంలోని బీజేపీ కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన వక్ఫ్ చట్ట సవరణ బిల్లును నిరసిస్తూ శనివారం పట్టణంలో ముస్లింలు పెద్ద ఎత్తున ర్యాలీ చేపట్టారు. పట్టణంలోని జామియా మసీదు కమిటీ ఆధ్వర్యంలో మసీదు నుంచి ర్యాలీ ప్రారంభమైంది. ముస్లింలపై ప్రతీకారంతో ఎన్‌డీఏ ప్రవేశపెట్టిన వక్ఫ్ సవరణ బిల్లును వ్యతిరేకించాలంటూ బీజేపీ, టీడీపీలకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ప్లకార్డులతో సోమప్ప సర్కిల్ వద్దకు చేరుకున్నారు. అక్కడ వక్ఫ్ చట్ట సవరణ బిల్లు ప్రతులను దహనం చేసి నిరసన తెలిపారు. కార్యక్రమంలో స్థానిక జామియా మసీదు అధ్యక్షుడు ఖాశింబేగ్, ముస్లిం పెద్దలు మనియార్ వాహిద్ పాల్గొనగా.. ముస్లిం మతపెద్ద జహీర్ మౌలానా, ఎస్‌డీపీఐ నాయకుడు ఖాదర్, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఖాశింవలిసీపీఐ పట్టణ కార్యదర్శి రంగన్న, ఐఎఫ్‌టీయూ నాయకుడు హనీఫ్‌లు సంఘీభావం తెలిపారు.

వక్ఫ్ చట్ట సవరణకు వైఎస్సార్‌సీపీ వ్యతిరేకం

ఎన్‌డీఏ ప్రభుత్వం తీసుకొచ్చిన వక్ఫ్‌బోర్డ్ చట్ట సవరణ బిల్లుకు వైఎస్సార్‌సీపీ వ్యతిరేకించిందని మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, జిల్లా వక్ఫ్ బోర్డ్ మాజీ ఉపాధ్యక్షుడు రియాజ్‌అహమ్మద్ తెలిపారు. తమ నేత మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వక్ఫ్ బిల్లును పూర్తిగా వ్యతిరేకించారని, అదేవిధంగా పార్లమెంట్ ఉభయ సభల్లో వైఎస్సార్‌సీపీ ఎంపీలు సైతం వ్యతిరేకించడం జరిగిందన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి



విద్యార్థినులను అవగాహన కల్పిస్తున్న మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణ



ఎమ్మిగనూరులో పారిశుద్ధ్యంపై అవగాహన కల్పిస్తున్న మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, సిబ్బంది

ఆదోని టౌన్: ప్రతిఒక్కరూ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, అందరి సహకారంతో స్వచ్ఛ ఆదోనిగా తీర్చిదిద్దుదామని మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణ అన్నారు. శనివారం స్వచ్ఛ ఆంధ్ర మిషన్-స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివాస్‌లో భాగంగా శనివారం కమిషనర్ ఎం.కృష్ణ ఆధ్వర్యంలో అక్షరశ్రీ స్కూల్‌లో విద్యార్థినీ, విద్యార్థులకు తడిపొడి చెత్త, హానికర చెత్త వేరుచేయడం తదితర అంశాలపై విద్యార్థులకు కమిషనర్ వివరించారు. తడిపొడి చెత్త వల్ల మానవాళికి జరిగే ప్రయోజనాలు, హానికర పదార్థాల వల్ల జరిగే నష్టాలను ఆయన తెలియజేశారు.

చేయిచేయి కలుపుదాం స్వచ్ఛ ఆదోని సాధిద్దాం

ఆదోని అర్బన్: చేయి చేయి కలుపుదాం-స్వచ్ఛ ఆదోనిగా సాధిద్దాం అనే నినాదంతో ప్రతి మూడో శనివారం స్వచ్ఛ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ట్రాఫిక్ సీఐ గంటా సుబ్బారావు తెలిపారు. శనివారం ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ సిబ్బంది పోలీస్‌స్టేషన్ వెనక ఉన్న క్వార్టర్స్ మొత్తం శుభ్రం చేశారు. ముళ్ల కంపలను తొలగించారు.

నందవరం : స్వచ్ఛతలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని, పరిశుభ్రత అందరి బాధ్యత అని ఎంపీడీఓ పుల్లయ్య అన్నారు. శనివారం మండల కేంద్రం నందవరంలో మండల అధికారులు గ్రామ సర్పంచ్ తోట సావిత్రి, జెడ్పీటీసీ నిఖిల్ చక్రవర్తి ఆధ్వర్యంలో ×స్వర్ణ ఆంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర¤ కార్యక్రమం నిర్వహించారు. ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో మానవ హారం చేపట్టి ప్రతిజ్ఞ చేశారు. అనంతరం గ్రామ సచివాలయం నుంచి స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వరకు అధికారులు, వివిధ శాఖల సిబ్బంది ర్యాలీ చేపట్టారు. వీధుల్లో చీపురు పట్టి రోడ్లను ఊడ్చారు. కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ శివప్పగౌడ్, ఆయా శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

స్వచ్ఛ ఆంధ్రకు ప్రతి ఒక్కరూ సహకరించాలి

పెద్దకడబూరు : స్వర్ణాంధ్ర.. స్వచ్ఛ ఆంధ్రకు ప్రతి ఒక్కరూ సహకరించాలని సర్పంచ్ రామాంజినేయులు, ఎంపీడీఓ నాగరాజుస్వామి పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో స్వర్ణాంధ్ర.. స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించి ప్రాథమిక (మెయిన్) పాఠశాల ఆవరణలో విద్యార్థులతో కలసి మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు. హోటల్, కూల్‌డ్రింక్స్ యజమానులకు తడి, పొడిచెత్త డబ్బాలను పంపిణీ చేశారు.

స్వచ్ఛ ఆంధ్రలో భాగస్వాములు కావాలి

ఎమ్మిగనూరుటౌన్: స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ దివాస్‌లో పురప్రజలు భాగస్వాములు కావాలని మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి పిలుపునిచ్చారు. పట్టణంలో శనివారం సోర్స్ రిసోర్స్ టీమ్‌లో భాగంగా పట్టణంలోని 3,4 వార్డుల్లో ప్రజలకు తడి, పొడి, హానికర చెత్తను వేరు చేయడంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ డీఈలు నీరజ, రాజునాయక్, విక్టర్‌బాబు, ఏఈలు శరత్‌చంద్ర, మదన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.